భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



మొహమ్మద్ మోహసిన్ ఖురేషీ, అజీజ్ తదితరులకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎంఎస్ మక్తా ఈద్గా వద్ద ప్రార్థనల కోసం తరలివచ్చిన ముస్లింలు

ఖైరతాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఖైరతాబాద్‌లోని ప్రాచీన కుతుబ్‌షాహీ మసీదులో, ఎంఎస్ మక్తాలోని ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. కుతుబ్‌షాహీ మసీదు వద్ద ఖైరతాబాద్ బీఆర్ఎస్ నేత గజ్జెల ఆనంద్ ఆధ్వర్యంలో నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పి బహుమతులు అందజేశారు. మక్తా ఈద్గా మైదానంలో మాజీ కార్పొరేటర్ ఎస్కే షరీఫ్, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరిగాయి. ప్రార్థనల అనంతరం ఆధ్యాత్మిక సందేశం వినిపించారు. బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి ఖైరతాబాద్‌లోని పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు చెప్పారు. పాషా భాయ్, మహేందర్‌బాబు, చందు, మహేష్‌యాదవ్, ఆనంద్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఖైరతాబాద్ బడా గణేష్ చౌరస్తా వద్ద హిందూ ముస్లింలు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆప్యాయంగా కౌగిలించుకొని మత సామరస్యాన్ని చాటారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో..

ఎర్రగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలు మసీదులు, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ముస్లిం నాయకులు ప్రముఖులకు తమ ఇళ్లలో విందు భోజనాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం చైర్మన్ మొహమ్మద్ మోహసిన్ ఖురేషీ ఎర్రగడ్డలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విందులో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ అజీజ్, మహమ్మద్ షాకీర్, హుస్సేన్, ఎర్ర కృష్ణకుమార్, పోతురాజు నర్సింగ్ రావు, పేగడ రాజు, ఆకాష్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రంజాన్ వేడుకలకు హాజరైన ముస్లింలు



శ్రీనివాస కాలనీ వెస్ట్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నేత పీపీ రవిశేఖర్ రెడ్డి



ఖైరతాబాద్‌లోని ఓ ముస్లిం నాయకుడి ఇంటికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు



కుతుబ్ షాహీ మసీదు వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకుడు గజ్జెల ఆనంద్ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

బేగంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతితో పాటు ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సనత్‌నగర్ మోడల్ కాలనీలో ఉగాది వేడుకల్లో భాగంగా సనాతన ధర్మం-భావి తరాల భవిష్యత్తు అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జె.ఎస్.టి సాయి, హరిక, ప్రియాంక, సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

నేడు బల్కంపేటలో మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం

అమీర్‌పేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస సమాజసేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మధ్యాహ్న మిత్ర భోజన కార్యక్రమాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మి మంగళవారం ప్రారంభించనున్నారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ఉంటుందని ట్రస్టీ మేనేజర్ పార్థసారధి వెల్లడించారు. ఆదివారం మినహా ప్రతి రోజూ భోజనం ఉంటుందని.. శ్రేష్ట లంగ్ అండ్ చెస్ట్ కేర్ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ శ్యామ్ సుందర్ రాజ్ సహకారంతో చలివేంద్రాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



కళాకారులను సత్కరించిన కాలనీవాసులు

నృత్య కళాకారులకు సత్కారం

బంజారాహిల్స్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో సోమవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో పరంపర అకాడమీకి చెందిన నృత్య కళాకారులను సిద్దార్థ జ్యువెలర్స్ సెలబ్రిటీ డిజైనర్ నాగిని ప్రసాద్‌తో పాటు కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరంపర కళాకారులు ప్రదర్శించిన పలు నృత్యరీతులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నాగిని ప్రసాద్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, కళలను కాపాడుతున్న కళాకారులను ఉగాది వేళ సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యురాలు గడ్డం సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోర్ బోలీకి ప్రాధాన్యమివ్వడం హర్షణీయం

అమీర్‌పేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): లంబాడీల మాతృ భాష గోర్ బోలీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకుడు కునాల్ రాథోడ్ అన్నారు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్ బోలీని చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానిచడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.



కునాల్ రాథోడ్



వేడుకల్లో పాల్గొన్న మల్లు ప్రసాద్, రాజశేఖర్ తదితరులు

జెక్ కాలనీ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం

బేగంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని జెక్ కాలనీ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డా. మల్లు ప్రసాద్, రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు గ్రీన్ సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సన్మానించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జెక్ కాలనీ సమాఖ్య ప్రతినిధులు వెంకట్ సోమ పాల్గొన్నారు.

విజయలక్ష్మి దేవాలయంలో ప్రారంభమైన శ్రీరామనవమి వేడుకలు



రాగి పలకపై శ్రీరామ నామాన్ని రాస్తున్న భక్తులు

ఎర్రగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి సంపూర్ణ వాల్మీకి రామాయణ పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తులు రాగి పలకపై రాసి ఉన్న "శ్రీరామ" నామాన్ని 108 సార్లు వారి చూపుడు వేళ్లతో రాశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సంపూర్ణ వాల్మీకి రామాయణాన్ని పఠిస్తారు. ప్రతిరోజూ చేసే పూజల వల్ల భక్తులకు వివాహం, సంతానం, విద్య, ఆరోగ్యం, మోక్షం, ధనవద్ధి, వ్యాధి నివారణ తదితర ఫలితాలు పొందుతారని అర్చకులు గట్టు రంగాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి పాల్గొన్నారు.

బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్



బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

పంజాగుట్ట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో తమ సామాజిక వర్గానిది కీలకపాత్ర అని, బంజారా సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ డిమాండ్ చేశారు. 30 లక్షల జనాభా ఉన్న తమను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీకే నష్టమన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజేష్ నాయక్, అధ్యక్షుడు అశోక్ రాథోడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరగడంతో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. బంజారా జాతికి మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఇటీవల రాహుల్ గాంధీతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా, మీనాక్షి నటరాజ్, మహేష్ కుమార్ గౌడ్, డీకే శివకుమార్ తదితరులను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బంజారాలకు రిజర్వేషన్ ఇచ్చారని, అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నామని ఆయన వెల్లడించారు. తమ డిమాండ్‌కు పార్టీ స్పందించకపోతే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన బంజారాలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్పతి నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఐతరాజు అబెందర్, మాదిగ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు కొండ్రపల్లి రమేష్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటకం



బాలనాగమ్మ నాటకంలో రంగస్థల నటుల అభినయం

బంజారాహిల్స్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఫిలినగర్‌లోని ఫిలిం ఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ నాటకోత్సవాల్లో సోమవారం ఉయ్యూరుకు చెందిన శ్రీదేవి కళా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద నాటకం ఆకట్టుకుంది. ఈ నాటకంలో బాలనాగమ్మగా వీరమణి, కార్యవర్ధిగా సోమర ఎర్రస్వామి చౌదరి, ఫకీర్‌గా జెట్టి సాంబశివరావు, పులిరాజుగా ముత్యాల నాగేశ్వర్‌రావు, సంగుగా ఇంద్రజ, తిప్పడుగా ఈగ నాగేశ్వర్‌రావు, లచ్చిగా మనుప్రియ, జంగమ దేవరగా రాధాకృష్ణ నటించగా వీరికి హార్మోనియం సీహెచ్ నాగేశ్వర్‌రావు, డోలక్‌గా రామకృష్ణ సహకారం అందించారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నేటితరం యువతకు, సినీ ప్రేమికులకు రంగస్థల నాటకలను పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



రాగావధానం చేస్తున్న అవధాని గరికిపాటి వెంకట ప్రభాకర్ తదితరులు

అలరించిన స్వర రాగావధానం

చిక్కడపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సిలికానాంధ్ర సంస్థ వారి ఉగాది వేడుకల్లో భాగంగా సోమవారం ప్రముఖ సంగీత విద్వాంసులు గరికిపాటి వెంకట ప్రభాకర్ స్వర రాగావధానం కార్యక్రమం అద్భుతంగా జరిగింది. వివిధ అంశాలపై ప్రశ్నలకు అలవోకగా గానం చేస్తూ అవధాని గరికిపాటి వెంకట ప్రభాకర్ సమాధానాలు ఇస్తుండడంతో ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం స్వర రాగావధానానికే తలమానికమైందని అవధాని ప్రభాకర్‌ను ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్త డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ సందర్భంగా ప్రభాకర్ తదితరులను ఘనంగా సన్మానించారు.

దళిత నేత శంకర్‌దాస్ మృతి



శంకర్‌దాస్ (ఫైల్)

ఖైరతాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట నాయకుడు తలారి శంకర్‌దాస్ (52) ఆకస్మికంగా మృతి చెందాడు. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన శంకర్‌దాస్ స్థానిక సమస్యలతో పాటు దళిత హక్కుల కోసం పోరాడేవాడు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. దాసు అంత్యక్రియలు పంజాగుట్ట స్మశానవాటికలో సోమవారం సాయంత్రం జరిగాయి. చిన్ననాటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తగా, నాయకుడిగా పార్టీకి సేవలు అందించిన దాసు మాలమహానాడు రాష్ట్ర నాయకుడిగా వ్యవహరించి అనేక పోరాటాలు చేశారు ఆయన. గత అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే షరీఫ్, మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, ప్రవీణ్, ఫకీరయ్య యాదవ్‌లతో పాటు మాల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాసుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

కుషాయిగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బస్సును ఓవర్ టేక్ చేస్తూ వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కుటుంబ యజమాని అక్కడికక్కడే మృతి చెందగా.. అతని భార్య, పిల్లలు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ వివరాలను వెల్లడించారు. చర్లపల్లిలో నివసించే కొండెపాటి పుల్లారావు(32) సోమవారం సాయంత్రం భార్య మల్లీశ్వరి(30), కుమారులు రుత్విక్(8), రాజేష్(6)లతో కలిసి అశోక్‌నగర్ నుంచి చర్లపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఓ కారు ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పుల్లారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వసూళ్లు అదుర్స్

- ఆస్తిపన్ను వసూళ్లలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల ఘనత
- ఎన్నో ఏళ్ల తర్వాత టార్గెట్‌ను అధిగమించిన వైనం
- అధికారులు, సిబ్బందికి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ప్రశంసలు



జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ కార్యాలయం

ఖైరతాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లు ఆస్తిపన్ను లక్ష్యాలను అధిగమించాయి. జీహెచ్ఎంసీ పరిధిలోనే అత్యధిక ప్రభుత్వ సంస్థలున్న ఖైరతాబాద్ సర్కిల్‌కు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల ద్వారా రూ.32 కోట్ల మేర పన్ను వసూలైంది. దీంతో ఒక్కసారిగా ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్‌ను మించి పన్ను వసూలు చేసి ఖైరతాబాద్ సర్కిల్ రికార్డును సొంతం చేసుకుంది. మరోవైపు జూబ్లీహిల్స్ సర్కిల్ ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని టార్గెట్‌ను అధిగమించింది. దీంతో రంజాన్ సెలవు దినం, ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సోమవారం వసూలైన పన్ను వివరాలను పొందుపరుస్తూ జంట సర్కిళ్లలో అధికారులు, సిబ్బంది ఆనందాన్ని పంచుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత లక్ష్యాలను అధిగమించడంతో సిబ్బంది, అధికారుల సమన్వయ కృషి పనిచేసిందని మాట్లాడుకోవడం కనిపించింది.

లక్ష్యాలు ఇలా..

జంట సర్కిళ్లయిన ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌లలో లక్ష్యాలను మించి పన్ను వసూలు కావడం చాలా సంవత్సరాల అనంతరం కనిపించింది. ఎక్కువ పన్ను వసూలు చేసే జాబితాలో జీహెచ్ఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి సర్కిల్ మొదటి స్థానంలో ఉండగా.. రెండవ స్థానంలో జూబ్లీహిల్స్, మూడవ స్థానంలో ఖైరతాబాద్ సర్కిళ్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖైరతాబాద్ (17) సర్కిల్‌లో రూ.164 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు లక్ష్యం కాగా, పన్ను చెల్లింపులకు చివరి రోజైన సోమవారం సాయంత్రం 5 గంటల వరకు రూ.171.17 కోట్లను వసూలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మొత్తం 32 కోట్ల రూపాయల పన్ను రాగా.. సోమవారం ఒక్కరోజే 5 కోట్ల రూపాయల మేర వసూలైంది. మార్చి నెలలో మొత్తం రూ.61 కోట్లు వసూలు చేశామని ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

జూబ్లీహిల్స్ సర్కిల్‌లో..

ఇక జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 187 కోట్ల రూపాయల పన్ను లక్ష్యం ఉండగా దాదాపు 189 కోట్ల రూపాయలను వసూలు చేశారు. సోమవారం ఒక్కరోజే రూ.6 కోట్లకు పైగా పన్ను వసూలు చేయగా మార్చి నెల మొత్తం మీద 38.35కోట్ల రూపాయలు వసూలు చేశామని ఉపకమిషనర్ విప్రశాంతి తెలిపారు. గత సంవత్సరం ఈ సర్కిల్ పరిధిలో రూ.183 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైంది. ఈ సర్కిల్ పరిధిలోని అధికారులు ఈ ఏడాది బకాయి పడ్డ బడాబాబుల ఆస్తులను సీజ్ చేస్తూ పన్ను వసూలు చేశారు. బంజారా హోటల్, ఎస్‌వీఎం గ్రాండ్, జీఐఎస్ హోటల్, శాంగ్రిల్లా ప్లాజా, తాజ్ కృష్ణా తదితర బడా వ్యాపార సంస్థలు ఇందులో ఉన్నాయి. మొత్తం మీద అనుకున్న లక్ష్యాలను సాధించడంతో జంట సర్కిళ్ల అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

సర్కిల్ 19 పరిధిలో రూ.32 కోట్లు

పంజాగుట్ట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో టార్గెట్‌ను సాధించినప్పటికీ జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం నెరవేరలేదు. అధికారులు రూ.36 కోట్ల టార్గెట్ విధించగా సోమవారం రాత్రి వరకు 32 కోట్ల రూపాయల ఆస్తి పన్ను వసూలైంది. కాగా, ఆస్తి పన్నుపై చెల్లింపులపై వడ్డీ రాయితీ పథకం సోమవారంతో ముగిసింది.

జిమ్నాస్టిక్స్ పోటీల్లో నాయుడికి వెండి పతకం


ఇంటర్ రైల్వే పోటీల్లో ఉదయ్ నాయుడు

చిలకలగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఉదయ్ నాయుడు వెండి పతకం కైవసం చేసుకున్నాడు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, రైల్ నిలయం అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉదయ్ నాయుడు ఇటీవల కలకత్తాలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే జిమ్నాస్టిక్స్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వే తరఫున ప్రాతినిథ్యం వహించి వెండి పతకం సాధించాడు. రైల్వే కోచ్ ప్రవీణ్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో రజత పతకం, ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో కాంస్య పతకం, వరల్డ్ కప్ పోటీల్లో బహుమతులు కైవసం చేసుకుని, స్పోర్ట్స్ కోటాలో సెప్టెంబర్ 2024లో ఉద్యోగం పొందాడు. తోటి ఉద్యోగులు బంధువులు, మిత్రులు అభినందనలు తెలిపి మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు.


శిక్షణ కరపత్రాలను ప్రదర్శిస్తున్న జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు

గృహోపకరణాల మరమ్మతులో శిక్షణ

పద్మారావునగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు పూర్తిచేసుకొని వేసవి సెలవులు గడుపుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవటానికి ఉచిత నైపుణ్య శిక్షణను అందిస్తున్నామని జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి తెలిపారు. ముషీరాబాద్ చౌరస్తా సమీపంలోని భోలక్‌పూర్‌లో ఉన్న తమ శిక్షణ కేంద్రంలో 30 రోజులపాటు ఇచ్చే శిక్షణలో ఏసీ, వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కూలర్, గీజర్ వంటి గృహోపకరణాల మరమ్మతులో, 15 రోజుల పాటు హోమ్ క్లీనింగ్ కోర్సులలో శిక్షణను అందించిన అనంతరం సర్టిఫికెట్‌ను అందిస్తామని తెలిపారు. 16 ఏళ్ల నుండి 50 ఏళ్ల వయసు వరకు ఎవరైనా చేరవచ్చని, ఆసక్తి కలవారు ఇతర వివరాలకై ఎం.శ్రీనివాస్‌ను 81068 87523 ఫోన్‌లో సంప్రదించవచ్చని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


సంఘం కార్యాలయంలో పంచాంగం ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

పంచాంగం పుస్తకాల ఆవిష్కరణ

అడ్డగుట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం తుకారాంగేట్ కార్యాలయంలో సోమవారం సంఘం అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ సిటీజన్లు కందుకూరి గణేష్, ఉప్పల శ్రీనివాస్, పురం జగదీశ్వర్, నూకల నర్సింగ్‌రావు, సంఘం ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్

బౌద్ధనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బీదల బస్తీకి చెందిన చంద్రశేఖర్ నియమితులయ్యారు. సోమవారం బీదల బస్తీ మైదానంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేడ్కర్ జయంతికి సంబంధించిన ఏర్పాట్లకు చర్చించుకున్నామన్నారు. అధ్యక్షుడి పదవితో పాటు కార్యవర్గ కమిటీ కొత్తగా నియమిస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకునందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెపారు. కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం ప్రసాద్, ఏఎస్ చలపతి, అంబాల రాజేశ్వర్ రావు, జీవీ కృష్ణ, లలిత, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంకులను అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులకు కేటాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అవినీతిని కట్టడి చేయడంతో పాటూ తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు
- బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి..


పుల్లారావు (ఫైల్)


నుజ్జునుజ్జైన కారు ముందు భాగం, బైక్

కుషాయిగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బస్సును ఓవర్ టేక్ చేస్తూ వేగంగా దూసుకు వచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కుటుంబ యజమాని అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యా పిల్లలు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చర్లపల్లిలో నివసించే కొండెపాటి పుల్లారావు(32) ప్రైవేటు ఉద్యోగి. సోమవారం సాయంత్రం భార్య మల్లీశ్వరి(30), కుమారులు రుత్విక్(8), రాజేష్(6)లో కలిసి అశోక్‌నగర్ నుంచి చర్లపల్లి వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో చర్లపల్లి నుంచి అశోక్ నగర్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు(టీఎస్07యూహెచ్6562) ముందు ఉన్న బస్సును ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పుల్లారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్సులో గాయపడ్డ ముగ్గురినీ గాంధీ ఆస్పత్రికి తరలించగా, ప్రాణాపాయ స్థితిలో వారు చికిత్స పొందుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


చిలకలగూడ దర్గా, ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ప్రార్థనల అనంతరం శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


వారాసిగూడ కౌసర్ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లష్కర్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

సికింద్రాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని లష్కర్‌లో ఘనంగా జరుపుకున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని మసీదులు, ఈద్గాలలో సోమవారం జరిగిన రంజాన్ పవిత్ర ప్రార్థనలకు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రార్థనలు ముగియగానే పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులు సైతం ముస్లింలను కలిసి, ఈద్ ముబారక్... అంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు

బౌద్ధనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ చిలకలగూడ దర్గాలో, సీతాఫల్‌మండలి బౌద్ధనగర్ డివిజనల్‌లోని సోమవారం రంజాన్ వేడుకలు శక్తి శ్రద్ధలతో జరిగాయి. చిలకలగూడ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వారసిగూడ కౌసర్ మసీద్ మహముద్ గూడ, శ్రీనివాస్‌నగర్ మసీదులో జరిగిన వేడుకల్లో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేశారు.

తిరుమలగిరి మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బొల్లారం రిసాల బజార్ జామ-ఈ-మసీద్‌కు చెందిన ముస్లింలు అందరూ ఈద్గా వద్దకు చేరుకుని ఇమాం మహ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, రంగారెడ్డి జిల్లా యూత్‌కాంగ్రెస్ ఇన్‌చార్జి అరవింద్ ఈద్గా వద్దకు చేరుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రషీద్, సతీష్, గాంధీలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు లోకనాథ్, బీఆర్ఎస్ వార్డు-8 ప్రెసిడెంట్ కే.జి. రవికుమార్ ముస్లింలకు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


బోయినపల్లిలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్


రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు


రసూల్‌పురాలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్ శ్రీనివాస్


విజయపురి కాలనీలో నిర్వహించిన రంజాన్ విందులో పాల్గొన్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ తదితరులు



జామియా మసీద్ వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మహంకాళి ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురామ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్


ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సుధాకర్ చేసిన సేవలు అనిర్వచనీయం

బోయినపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో టీడబ్ల్యూఓ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు దివిటి సుధాకర్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా బోయినపల్లి బాపూజీనగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బానోత్ లాలూ నాయక్, హెచ్ఎం నీలిమల అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైబల్ వెల్ఫేర్ అదనపు ప్రాజెక్ట్ అధికారి చందాన సర్వే, డీటీడీఓ కోటాజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోటాజీ మాట్లాడుతూ ఎంతో మంది గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించిన సుధాకర్ సేవలు మరవలేనివని అన్నారు. ఆయన ప్రధానోపాధ్యాయుడే కాకుండా ట్రైబల్ వెల్ఫేర్ ఓఎస్డీగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారని 40 సంవత్సరాలుగా ట్రైబల్ వెల్ఫేర్ విద్యాశాఖలో ఎన్నో సేవలను అందించారు తెలిపారు. అతని సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ ఏ.ఎల్లమ్మ, జేఎం రెబెక్క, హెచ్‌డబ్ల్యూఓ అముక్త మాల్యద, హెచ్‌డబ్ల్యూఓ యాదయ్యలతో పాటు ఉపాధ్యాయులు ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా సిబ్బంది, స్నేహితులు, వివిధ పాఠశాలల టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశమైన టీడీపీ నాయకులు

సికింద్రాబాద్‌లో టీడీపీని బలోపేతం చేయాలి

- ఇన్‌చార్జి శ్రీనివాస్

సికింద్రాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తెలుగు దేశం పార్టీకి కంచుకోటగా ఉన్న సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పూర్వ వైభవం కోసం పార్టీ నాయకత్వం శ్రమిస్తోంది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇతర అసెంబ్లీ సెగ్మెంట్లతో పోలిస్తే సభ్యత్వ నమోదు, కార్యకలాపాల నిర్వహణలో అగ్రస్థానంలో కొనసాగుతున్న సికింద్రాబాద్ సెగ్మెంట్‌లో పార్టీని మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఇటీవల తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. సోమవారం పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మరింత రెట్టించిన ఉత్సాహంతో నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికీ పార్టీని వీడకుండా, వెన్నంటి ఉన్న కేడర్‌ను ప్రోత్సహించాలని, ఆపదలో ఉన్న కేడర్‌కు అండగా నిలవాలని, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సాధిస్తున్న విజయాలను ప్రజలకు వివరించాలని, చంద్రబాబు హయాంలో హైదరాబాద్ నగరాభివృద్ధి జరిగిన తీరు తెన్నులను గుర్తు చేయాలని నిర్ణయించారు. పార్టీ కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేస్తున్నందుకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు వల్లారపు శ్రీనివాస్‌ను అభినందించారు. టీడీపీ సీనియర్ నాయకులు పరిటాల విజయ్‌కుమార్, జివి.కృష్ణ, వెంకటస్వామి, శశిరేఖ, మురళీకృష్ణ, చంద్రమోహన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న భారతీయం సత్యవాణి తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- భారతీయం సత్యవాణి

తార్నాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని భారతీయం సత్యవాణి అన్నారు. తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో వంజరి మహిళా సదస్సును ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిభావంతులైన పలువురి మహిళలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భారతీయం సత్యవాణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో మహిళల గొప్పతనాన్ని సదస్సులో మహిళలకు వివరించారు. సమాజంలో మహిళల పాత్ర చాల కీలకమని, మహిళలు పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద, వంజరి సంఘం మహిళా నాయకురాళ్లు బొగ్గుల సునీత, అనురాధ, దాత్రిక సాయిరంజనీ, సాల్వేరు దేవిక, ఆరె గీత, శోభ, విజయలక్ష్మి, వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కాందారి వెంకటేశ్, కోశాధికారి అమరేందర్, ముత్తయ్య, విశ్వనాథం, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు మేఘన ఎంపిక


క్రీడాకారిణి మేఘన

బోయిన్‌పల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేషనల్ ఖోఖో పోటీలకు బోయిన్‌పల్లికి చెందిన ఎం.మేఘన ఎంపికైంది. సీఎంఆర్ స్పోర్ట్స్ అకాడమి బోయిన్‌పల్లిలో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణి మేఘన ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో హైదరాబాద్ జిల్లా తరఫున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకు ఒడిశాలో జరిగే సీనియర్ నేషనల్ ఖోఖో పోటీల్లో తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు తరఫున మేఘన ఆడనున్నది. ఈ పోటీలకు ఎంపికైన సందర్భంగా అకాడమి డైరెక్టర్ ఎస్.కె రెడ్డి, కోచ్‌లు ప్రసాద్, దాస్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్.కె రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం బోయిన్‌పల్లిలో ఖోఖో, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, స్కేటింగ్ క్రీడల్లో వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించి, ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బిషఫ్ సంజయ్ ఆనంద్, తదితరులు

హక్కులకు భంగం కలిగించేవారిని కట్టడి చేయాలి

- బిషఫ్ సంజయ్ ఆనంద్

తార్నాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవరిస్తున్న మతోన్మాదులను కట్టడి చేయాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బిషఫ్ సంజయ్ ఆనంద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలో ఏర్పాటు చేసిన రీజినల్ సమావేశంలో ప్రవీణ్ పగడాలకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ సేవకుల, సంఘాలపై దాడులు తీవ్రతరం అవుతున్నాయని, దీనిపై రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు స్పందించి దాడులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.


జామియా మసీద్ వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్, తదితరులు

భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ రంజాన్


- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ రంజాన్ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ పండగ సందర్భంగా సుభాష్ రోడ్డులోని జామియా మసీద్ వద్ద ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు అనంతరం వారికి ఈద్ ముబారక్ చెబుతూ వారిని ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండగను పురస్కరించుకొని ప్రపంచంలోని ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు ఆనంద్ పటేల్, కిషోర్, మహేష్ యాదవ్, మహేందర్, అరుణ్ భట్, కోటేశ్వర్ గౌడ్, మజీద్ అధ్యక్షులు మహమ్మద్ వాజిద్, కార్యదర్శి మసీ, సాధిక్, రైమన్ లతీఫ్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు ఆహ్వానం

తిరుమలగిరి మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న శ్రీరామనవమికి రావాలని కోరుతూ సోమవారం బొల్లారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాల్‌రాజు బృందం ఆహ్వాన పత్రికను అందజేశారు. కల్యాణ మహోత్సవానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో రాజు, మల్లేష్, సతీష్, గాంధీ, వినోద్, విష్ణు, కన్నా ఉన్నారు.

స్నేహితురాలు ఇంటికి వెళ్లిన బాలిక అదృశ్యం


సానియా ఖాజీ

బోయినపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... జాకీర్ హుస్సేన్ ఖాజీ, అతని భార్య నూర్‌భాను ఖాజీలు ఓల్డ్ బోయినపల్లి రాజు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె సానియా ఖాజీ(16) రంజాన్ మాసం సందర్భంగా నీరసంగా ఉందని ఇంట్లోనే ఉన్నది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో తాను తన స్నేహితురాలి ఇంటికి వెళ్లివస్తాను అని ఇంట్లో చెప్పి వెళ్లింది. రంజాన్ పండుగకు సామన్లు తేవడానికి తల్లి కూతురుకి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీనితో స్నేహితురాలి ఇంటికి వెళ్లి ఆరా తీయగా అసలు సానియా ఖాజీ తన వద్దకు రాలేదని తెలిపింది. స్నేహితురాలి ఫోన్‌కి ఓ అబ్బాయితో ఉన్న ఫొటోను వాట్సాప్ పంపించినట్లు తల్లికి చూపించింది. దీంతో కంగుతిన్న తల్లి ఆ ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తించి అతని పైనే అనుమానం ఉన్నట్లు బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



రెజిమెంటల్‌బజార్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ ఇస్లామియా మసీద్ సమీపంలోని ఫుట్‌పాత్ పై ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉండటంతో మార్కెట్ పోలీస్‌స్టేషన్ పెట్రోలింగ్ పోలీసులు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు 45-50 సంవత్సరాల వయస్సు ఉంటుందని అతని పేరు ఐలయ్య అని యాచకుడు లాగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.